


# మారని విలువలు

పి. పాపిరెడ్డి

సుఖమంటే యేమిటో యెరుగని సుబ్బరామయ్య పంతులు కష్టాలనే సుఖాలుగా భావించుకొనేవాడు. ఆ కష్టాలు కూడా పడుచుపెళ్లాన్ని వదలని ముసలి మొగుడిలా ఆయన్ని అంటిపెట్టుకొని ఉండేవి.

ఆస్తిని హరించి అప్పును పెంచి ఎప్పుడూ మంచంలో తీసుకొనే తండ్రి, తమ సుఖంకోసమే కొడుకును కన్నామనుకునే తల్లి, తీరని అవసరాలతో నిత్యం అలమటించే ఆరుగురు సంతానం తలచెడి తమ్మునింటికి చేరినా వళ్లు వంచకుండా కాలం వెళ్లబుచ్చే అక్క, ఆమె తాలూకు ముగ్గురు పిల్లలు, బరువులు, బాధ్యతలు తప్ప హక్కులు, అధికారాలు తెలియని భార్య- వీరు సుబ్బరామయ్య సామ్రాజ్యంలో నిజనం. వీరందరి ఆశలు, అవసరాలకు ఆయన కేంద్రం. తను లేకపోతే వీరి గతేమిటి? అనుకున్నప్పుడు సుబ్బరామయ్య హృదయం గర్వంతో పొంగిపోయేది. తన జీవితానికి ఒక అర్థం, పరమార్థం ఉందని భావించేవాడు. అందుకే ఆయన జీవించేవాడు.

మొలలోతు దుఃఖములో మోకాలిలోతు సుఖాన్ని పొందుతున్న సుబ్బరామయ్య నెత్తిన ఒకనాడు ఉన్నట్లుండి పిడుగు పడింది. నిజంగా పిడుగు పడితే ఆయన సంతోషించి శ్రీనివాసునికి కల్యాణం చేయించి ఉండేవాడే. కాని అది పిడుగు కాదు. పిడుగును మించిన ప్రమాదం.

ఆరోజు ఉదయం సుబ్బరామయ్య మజ్జిగ పుచ్చుకొని మంచి కాఫీ త్రాగి

నట్లుగా ఫీలయ్యాడు. లభ్యమైన దానిలో లభించనిదాన్ని ఊహించుకొని తృప్తి పడ్డం ఆయనకు మొదటినుండి అలవాటే. బజారుకు బయలుదేరబోతుండగా పార్వతమ్మ గాజులు కాలింగ్ బెల్లులా ఘల్లుమన్నాయి. సైగ తెలిసిన సుబ్బ రామయ్య వంటయింట్లోకి వెళ్లాడు. సరుకులపట్టి చేతికిచ్చి చార్జిషీటు దాఖలు చేసిన సబ్ఇన్స్పెక్టరులా నిలబడింది పార్వతమ్మ. పట్టీ చూచిన పంతులుగారు ముద్దాయిలా మూతి బిగించి, డిఫెన్సు లాయరులా పుంజుకొని, కేసును సాకల్యంగా అర్థంచేసుకొన్న జడ్జిలా నవ్వి భార్యను దగ్గరకు పిల్చాడు. దగ్గరగా వచ్చిన భార్య కొప్పులోని గతిరాత్రి మల్లెల తాలూకు పరిమళం ఉదయాని కేమైనా ఉందేమో పరీక్షించబోయాడు.

'ఏమిటండీ ఇది?' అంటూ సిగ్గుగా, చిరుకోపంగా చూచింది.

'కాకరకాయలో చక్కెర ఎందుకు వేసుకొంటారో తెలుసునా పార్వతీ? చేదు తినడానికి. ఇదీ అందుకే,' అన్నాడు పంతులు నవ్వుతూ, చేతిసంచి ఊపుకుంటూ వెళ్లతూ.

ఎమర్జన్సీలో సెన్సారడలా లిష్టులోని సరుకులన్నీ కట్ చేసి నేరుగా మార్కెట్టుకు వెళ్లి జేబులో ఉన్న చిల్లరతో గోంగూర కొనుక్కొని కొంప చేరాడు పంతులు. పచ్చడి మెతుకులు పరమాన్నంలా భుజించి తొమ్మిది గంటలకే బడికి బయలుదేరాడు.

శ్రావణం వచ్చినా చైత్రం వెళ్లినట్లు లేదు. అస్తవ్యస్తంగా ఉన్న ఆఫీసుకు అకస్మాత్తుగా వచ్చిన ఆఫీసరులా సూర్యుడు మండిపడుతున్నాడు. మంద పవనానికి మెల్లంగా తలలూపుతూ గేటు దగ్గరి అశోకాలు బడికి వస్తున్న పంతుళ్లకు, పిల్లలకు స్వాగతం చెబుతున్నాయి. విద్యాలయంలో కాలుపెట్టిన సుబ్బరామయ్యకు దేవాలయంలో అడుగు పెట్టినట్లుగాఉండి మనసంతా ఒక విధమైన పవిత్రభావంతో నిండిపోతుంది.

మూడోగంట కొట్టగానే సుబ్బరామయ్యగారు క్లాసుకు వెళ్లి పాఠం ప్రారంభించారు. పిల్లలంతా సిద్ధి పొందిన బుద్ధదేవుళ్లా బుద్ధిగా కూర్చున్నారు. అనర్గళంగా సాగుతున్న బోధన అకస్మాత్తుగా ఆగింది. పిల్లలంతా ఆశ్చర్యంగా పంతులువైపు చూశారు. పంతులు ప్రసాద్వైపు చూస్తున్నాడు. ప్రసాద్ తన ముందుబెంచిలో ఉన్న పద్మ జడకొసను సున్నితంగా పైకెత్తి ఆడుకుంటున్నాడు. దుష్టశిక్షణ తక్షణ కర్తవ్యంగా భావించిన పంతులు కళ్లకు మరేమి కన్పించలేదు, ద్రౌపది జుట్టు పట్టుకొన్న దుశ్శాసనుడిలా ప్రసాద్ తప్ప. ఆయన చేతిలోని వెదురుబెత్తం ప్రసాద్ శరీరంమీద శివతాండవం చేసింది. బెత్తం విరిగింది. ఆవేశం తగ్గింది. ఆయన మొహంలోని ముడుతల్లో ఆగ్రహం విరిగి ఆలోచనా,

ఆప్యాయత చోటుచేసుకున్నాయి. ప్రసాద్‌వైపు చూస్తూ, 'అగ్నితోను ఆడపిల్లలతోను ఆడుకోకురా ప్రసాద్! అవి రెండూ సక్రమంగా వాడుకొంటె ఎంత మేలుచేస్తాయో, అక్రమంగా ఆడుకుంటే అంత కీడుచేస్తాయి. మరెప్పుడూ ఇలా ప్రవర్తించకు.' అన్నాడు. గంట మ్రోగింది. పంతులు లేచి మరొక క్లాసుకు వెళ్లాడు.

రెండో పీరియడ్ కాగానే స్టాఫ్ రూముకు వచ్చిన సుబ్బరామయ్య దృష్టి వెనుక వైపున్న ఆఫీసు రూముపై పడింది. విద్యార్థులందరు గుమిగూడి గందరగోళంగా అరుస్తున్నారు. హెడ్ మాస్టరుగారి సమాధానానికి వారు సంతృప్తిచెందడంలేదు. 'సుబ్బరామయ్య మీద చర్యతీసుకోవాలి- సుబ్బరామయ్య నశించాలి-' అంటూ నినాదాలు చేయడం ప్రారంభించారు. పంతులుకు విషయమంతా వివరంగా బోధపడసాగింది.

తాను ఎవరి బాగోగులకొరకు అహర్నిశలు కృషిచేస్తున్నాడో వారే తన నాశనాన్ని కోరుతూ ఎలుగెత్తి అరుస్తున్నారు. తన కన్ను తన వ్రేలితోనే పొడుచుకున్నట్లు అన్పించింది ఆయనకు.

తన సర్వీసులో ఎప్పుడూ యిలాంటి సంఘటన సంభవించలేదు. తాను తృప్తిగా పాఠం చెప్పేవాడు. తప్పు చేసినవారిని దండించి దారిలో పెట్టేవాడు. విద్యార్థులందరు తన నిజాయితీకి, నిష్కల్మషత్వానికి, పాండిత్యానికి, బోధనా పాటవానికి మంత్రముగ్ధుల్లా ఉండి మనోవాక్కాయ కర్మలా తనను పూజించేవారు. ఇన్ని బాధల్లో తనకు సాంత్వన ఇచ్చేది ఇదొక్కటే.

ప్రసాద్ పచ్చని శరీరంమీద ఎఱ్ఱగా చారలుదేరిన బెత్తం బెందులు ఆయన కళ్లముందు కదిలాయి. తాను అనవసర ఆవేశానికి గురిఅయి త్వరపడ్డానా అని కలవరపడ్డాడు. నీళ్ల తిరుగుతున్న కళ్లతో బాధగా చూస్తున్న పద్మ జ్ఞాపకం రాగానే తానేమీ తప్పు చేయలేదనే ధైర్యం కల్గింది. ఈ చర్య ప్రసాద్ భవిష్యత్తు దృష్ట్యా తగినదేనని తృప్తికూడా కల్గింది. కాని ప్రసాద్ కళ్లలో కదిలిన కసి, పగ జ్ఞాపకం వచ్చి వాడి అజ్ఞానానికి జాలి కల్గింది. సుడిగుండంలోనికి ఉరికేవాన్ని జుట్టుపట్టుకొని గట్టుకు లాగితే, 'నా మాడు మంటపుట్టింది.' అని మండిపడేవాన్ని చూసి జాలిపడాల్సిందే కాని బాధపడవలసిన పనిలేదు. ఆయన హృదయం తేలికపడింది. ఇంతలో హెడ్‌మాస్టరుగారు స్టాఫ్ అందరిని రమ్మంటున్నారని ప్యూన్ వెంకటనరసు వచ్చాడు.

'ఏమోయ్. ఏమైందక్కడ?' అన్నాడు వెంకటాద్రి ఎరగనట్లు.

'ఏముంది సార్. ఎంతచెప్పినా వినక పిల్లలందరు గోలచేస్తుంటే మీరు ఇండ్లకు వెళ్లండి. మేము ఆలోచించుకొని ఏదో ఒకటి చేస్తామన్నారు హెడ్‌మాస్టరుగారు.

అంతటితో అందరు ఇళ్లకు వెళ్లారు.' అన్నాడు వెంకటనరసు.

సమావేశం ప్రారంభమయింది. అధ్యక్షస్థానంలో ఉన్న హెడ్‌మాస్టరు హనుమంతరావుగారు కుర్చీలో నల్లులున్నాయో, ముల్లులున్నాయో తెలియదుగాని ఒక్క క్షణంకూడా తాపీగా కూర్చొనలేకపోతున్నారు. ఉపాధ్యాయులంతా పగలడానికి సిద్ధంగా ఉన్న బాంబును పరీక్షచేస్తున్న శాస్త్రజ్ఞుల్లా ఉన్నారు. ఆ పగలబోయే బాంబుమీద పకడ్బందిగా కూర్చున్నట్లున్న సుబ్బరామయ్యమీద కొందరికి జాలి, కొందరికి సానుభూతి, మరికొందరికి సంతోషం కల్గాయి.

'ఏమండీ సుబ్బరామయ్యగారూ? ఏమిటిదంతా? ఎంత చిక్కు వచ్చి పడిందో చూడండి' అన్నారు హెడ్ మాస్టారుగారు ఎట్లా ప్రారంభించాలో, ఏమడగాలో తోచక.

సుబ్బరామయ్య క్లాసులో జరిగిన విషయం సవివరంగా వివరించాడు. అందరు విన్నారు.

'వాడు, ఆ ప్రసాద్ నా క్లాసులో కూడా అంతేనండి. అస్తమానం ఆడపిల్లలను వేదించుక తింటుంటాడు,' అన్నాడు అమ్మాయిలంటే పడిచచ్చే అనంతాచారి ఎంతో ఆవేదనతో.

'మీ క్లాసే కాదండి. ప్రతి క్లాసులోనూ అంతే. అయితే మనందరం సుబ్బరామయ్యలా కొట్టలేకపోయాం. ఎందుకని?' ప్రశ్నించాడు వెంకటాద్రి ఇండియాకు ప్రెసిడెంటు ఎవరన్నంత తేలిగ్గా.

'ఎందుకంటె ఆ ప్రసాద్ గ్రామ ప్రెసిడెంటు కొడుకని, ఆయన తల్చుకుంటే సెక్రటరి చెవిలో ఊది మనలను శంకరగిరి మాన్యాలను పట్టించగల సమర్థుడని. అందుకు' అన్నాడు ఆ ఊరివాడు, హైస్కూలు క్లార్కు అయిన అప్పారావు, ఇది అందరికి తెల్సిన అన్సరే అన్నట్లు.

'అదీ సంగతి. ఇది జగమెరిగిన సత్యం కదా! తెలిసుండీ నిప్పులో వేలు పెట్టేవారిని, ఈత రాదని తెలిసీ ఏట్లో దూకేవారిని ఏమిచేద్దాం చెప్పండి' అన్నాడు వెంకటాద్రి ప్రెసిడెంటు పరాక్రమాన్నీ, సుబ్బరామయ్య అల్పత్వాన్నీ సూచిస్తూ.

'యమ్.ఎల్.ఏ.ని పట్టుకొని ఛైర్మన్ దగ్గరకు వెళ్తే ఈ ప్రెసిడెంటు పస ఏమిటో తేల్తుంది' అన్నాడు రామిరెడ్డి ఉద్రేకంగా రెండోవైపు కాస్తూ.

'వెళ్లూ. అదీ చూస్తావూ' అన్నాడు వెంకటాద్రి వెటకారంగా.

తేలుకుట్టినట్లు త్రుళ్లిపడ్డారు హెడ్ మాస్టరుగారు.

'ఏమండీ మేష్టార్లు. దయచేసి ఈ సమస్యకు పొలిటికల్ కలర్ ఇవ్వకండి.




సామరస్యంగా సమస్య పరిష్కారమయ్యే మార్గం చూడండి' అన్నారు.

'సామరస్యానికి తావేదండీ. అవతలి వారు ప్రెసిడెంటు అయె. పిడుక్కూ బియ్యానికి ఒకటే మంత్రమని అందరినీ బాదితే మన బాధ ఇట్లాగే ఉంటుంది,' అన్నాడు సుందర్రాజు కొడి ఎత్తుతూ.

'పిడుక్కూ బియ్యానికి మంత్రాలు వేరయినా పంతులుకు మాత్రం పిల్లలంతా ఒకటే మేష్టారూ. ప్రెసిడెంటు కొడుకు, మునసబు అల్లుడు, కరణం కూతురు అంటూ వారిని గౌరవిస్తూ , బీదాబిక్కీనా దండించేది ? అందుకే మన సమాజం ఇట్లా తగలడింది,' అన్నాడు నిమ్న జాతుల ప్రతినిధి, సోషల్ టీచరు సుబ్బారావు ఈసడింపుగా.

'బీదాబిక్కీని కాకుంటే అగ్రజాతులనే దండించవయ్యా దమ్ము ఉంటే,' అన్నాడు పానకాలశాస్త్రి పూనకం వచ్చిన మనిషిలా.

ఇహ లాభంలేదని హెడ్మాస్టారు గొంతు లేపారు. 'ఏమండీ ? అవతల విద్యార్థులు ఉపాధ్యాయుని మీద చర్య తీసుకోమంటూ గోలచేస్తున్నారు.మీరేమో అసలు విషయాన్ని ప్రక్కకు నెట్టి ఆకాశంలో పిల్లిమొగ్గలు వేస్తున్నారు. నాకేమో మునిగే పడవలో సముద్ర ప్రయాణం చేస్తున్నట్లుగా ఉంది. ఏమి చేయాలో త్వరగా తేల్చండి,' అన్నారు.

'ప్రెసిడెంటు కొడుకయినా, ఛైర్మన్ కొడుకైనా గురువుకు శిష్యుడే కాని గురువు కాడు. తప్పుచేసినవాణ్ని శిక్షించాల్సిందే కాని ఒప్పుని వదలిపెట్టడం గురువు తన కర్తవ్యాన్ని విస్మరించడమే' నిదానం పంతులు నరసింహమూర్తి చెప్పాడు తాపీగా

'నిజమేనండి. ఆ శిక్షకు ఒక హద్దు ఉంది. AERలో చూశారూ,' అంటూ ఆ రూల్ గుర్తుకురాక తల గోక్కున్నాడు అకౌంటు టెస్టుకు ఆఱుసార్లు అప్పియర్ అయిన ఫస్ట్ అసిస్టెంటు పూర్ణానందం.

అందరి ఉక్తులు, వ్యంగ్యోక్తులు, హెచ్చరికలు, సలహాలు విన్న సుబ్బరామయ్య లేచి అందరినీ ఉద్దేశించి ఇలా అన్నాడు.

'ప్రసాద్ అంటే నాకేమి ఈర్ష్యా ద్వేషాలు లేవు. ఆ పసివాని హృదయంలో రేగిన విషవాయువును హరించాను. బెందులు మాస్తాయి కాని సకాలంలో చర్య తీసుకొనకపోతే బుద్ధులు మారవు. వాడి ఆస్తి, అంతస్తులతో నాకు నిమిత్తం లేదు. వాడి భవిష్యత్తే ముఖ్యం. ఆ దృష్టితోనే ఉపాధ్యాయునిగా నా కర్తవ్యాన్ని నేను నిర్వర్తించాను. దాని ఫలితం పరిణామం ఏలాంటిదైనా స్వీకరించడానికి నేను సిద్ధమే. మీకు ఆందోళన కల్గించినందుకు విచారిస్తున్నాను,' అంటూ హెడ్‌మాస్టరు గారికి చెప్పి ఇంటికి వెళ్ళిపోయాడు.

సుబ్బరామయ్య వాకిట్లో అడుగుపెట్టగానే తండ్రి 'నీ ఆశయాలు, ఆవేశాలతో కొంప కూలుస్తావు నాకు తెలుసు. మమ్మల్ని బావిలో తోసి నీవు బైరాగుల్లో కలవాలనుకుంటున్నావు. లేకపోతే పాములతో ఎందు కాడుకుంటావు'అంటూ దండకం మొదలుపెట్టాడు.

'పాములు కూడా పవిత్రమైనవే నాన్నా. సాక్షాత్తూ ఆ పరమేశ్వరుడికి పాములే కదా హారాలు' అన్నాడు సుబ్బరామయ్య తండ్రికి సమాధానంగా.

'అదికాదురా అబ్బాయి' తల్లి అందుకొంది. 'నాకు తెలియక అడుగుతా. ఇంతమంది పంతుల్లుంటే నీకే ఎందుకు వచ్చిందిరా ఈ బెడద. దారినపోయే దరిద్రాన్ని ఇంటిదాకా వచ్చిపొమ్మన్నాడట నీలాంటి అమాయకుడు.'


'వాడు అమాయకుడు కాదే. ఇప్పుడే చెప్పాడుగా సాక్షాత్తూ శంకరున్నని' అన్నాడు తండ్రి వెటకారంగా.

మంచం మీద కూర్చుంటూ అందరినొకసారి సాలోచనగా చూశాడు సుబ్బరామయ్య. అందరి హృదయాలలో ఏదో ఆందోళన, భయం, దాని తాలూకు విచారం కళ్లలో ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. స్కూలులో లేచిన తుఫాన్ గృహసాగరాన్ని కూడా తీవ్రంగా తాకిందని గ్రహించి నిట్టూర్చాడు.

ఇంతలో అక్కడకు దూసుకవచ్చిన చిన్నవాడు ఏడేండ్ల మధు తండ్రికాళ్లూ చేతులు తవిడాడు. 'నిన్ను కొట్టలేదా నాన్నా?' అన్నాడు భయంగా, ఆదుర్దాగా.

ఆయన హృదయం కలుక్కుమంది. మధును దగ్గరకు తీసికొని 'నన్ను ఎందుకు కొడతార్రా చిన్నా' అన్నాడు మృదువుగా.

'నువ్వేమో వాళ్ళ ప్రసాద్‌ను కొట్టా




వటగా. వాళ్ళనాన్న నిన్ను కొడతాడని మా బళ్ళో పిల్లలంతా అనుకుంటున్నారు. నాకు బలే ఏడ్పు వచ్చింది నాన్నా' అంటూ ఇక ఆపలేక వెక్కి వెక్కి ఏడ్చాడు మధు.

ఆయన కళ్లు చెమర్చాయి. మధును ఇంకా దగ్గరకు లాక్కొని హృదయానికి హత్తుకొన్నాడు. తల నిమిరి కన్నీరు తుడిచాడు. మధు మొహంలోకి ప్రసన్నంగా చూస్తూ 'మొన్న మీ మేష్టారు నిన్ను కొట్టాడని నీవు యేడుస్తూ రాలేదురా బాబు! ఆరోజు మీ మేష్టారును నేను కొట్టానా ? చెప్పు ?' అన్నాడు.

'నువ్వు కొట్టలేదు నాన్నా' అన్నాడు ముద్దముద్దగా ఏడుపు మ్రింగుతూ.

'మరి వాళ్లు మాత్రం నన్ను ఎందుకు కొడతార్రా చిన్నా!' అన్నాడు.

మధుకు అనుమానం తీరింది. విచార మేఘాలు తొలిగి మొహం తేటపడింది.

ఈ సంభాషణ వింటున్న తల్లి పార్వతమ్మ తల ప్రక్కకు త్రిప్పి కళ్లు తుడుచుకొంది.

భోజనానికి కూర్చున్న సుబ్బరామయ్య తొడమీద వెచ్చటి కన్నీటిబొట్టు పడింది. ఆయన తలఎత్తి అన్నం వడ్డిస్తున్న భార్య మొహంలోకి చూశాడు. 'పార్వతీ! ఏడుస్తున్నావా' అన్నాడు ఆశ్చర్యంగా. సీటిపొరల వెనుక చలించే చేపల్లా కనుపాపలు కదులుతున్నాయి.

'పార్వతీ! న్యాయాన్యాయాల అంతిమ తీర్పరి ఆ భగవంతుడే కదా! ఆయన దృష్టిలో నేను చేసింది న్యాయం. నా

మాట విశ్వసించి నీవు ధైర్యంగా ఉండు అన్నాడు.

'నాకు తెలుసండీ, మీరు ధర్మం తప్పరని. కానీ ఎందుకో ఎంత అపు కున్నా ఈ కన్నీరు ఆగడంలేదు' అంది నవ్వుతూ.

సుబ్బరామయ్య భార్య మొహంలోకి తదేకంగా చూస్తున్నాడు. వదనంలో దరహాసం, నయనాల్లో విషాదం-ఆమె మోము ఒక సజీవ వర్ణచిత్రంలా తోచింది. ఆమె ఆశ్చర్యంగా 'ఏమిటండీ అలా చూస్తున్నారు' అంది.

'నీ మొహంలో జీవితాన్ని చూపించాడే దేవుడు' అన్నాడాయన.

'పొండి మీరు మరీను' అనురాగంగా చూస్తూ లోపలికి వెళ్ళింది. సృష్టి వైచిత్ర్యాన్ని, జీవితంలోని వెలుగు నీడలను నెమరువేసుకుంటూ తృప్తిగా భోజనం చేసి లేచాడాయన.

ఆరోజు రాత్రి ఎంత ప్రయత్నించినా ఆయనకు నిద్రపట్టలేదు. అర్ధరాత్రి అయి ఉంటుంది. మాగన్నుగా ఉన్న ఆయనకు తలుపు చప్పుడు విన్పించింది. ఏమిటా అని తలుపు తీసి బయటకు రాగానే క్షణకాలం నివ్వెరపోయాడు. వజనుపైగా విద్యార్థులు ఇంటిముందు గుంపుగా ఉన్నారు. పగబట్టిన పిల్ల త్రాచులా ప్రసాద్ తలఎత్తి చూస్తున్నాడు. అందరినీ ఒక్కసారి కలయ చూశాడు. 'మీరు ఎందుకు వచ్చారో నాకు తెలుసు' ఒక్క క్షణం ఆగాడు. మీలో ఎవరైనా మీ అంతరాత్మ సాక్షిగా ప్రసాద్ చేసింది రైటు అనేవారుంటే ముందుకు రండి' అన్నాడు గంభీరంగా. ఒకరి మొఖాలొకరు చూసుకొన్నారు.

'అయితే మాత్రం తప్పును సరిదిద్దాలి గాని గొడ్డును బాదినట్లు బాదడమేనా మేష్టారూ ?' అన్నాడు నాగేంద్ర తీక్షణంగా.

'నీవు చెప్పింది నిజమేరా నాగూ. ప్రసాద్‌ను కాదు నేను బాదింది, ప్రసాద్ లోని పశువును. పశుత్వాన్ని పారద్రోలి మానవత్వాన్ని మేలుకొలిపి ప్రసాద్‌ను ఒక మంచి మనిషిగా మలచాలనే నా ఆశయమే నాచేత అలా చేయించింది. ఈనాడు నన్ను ద్వేషించినా వాడిలో మానవత్వం మేలుకొన్ననాడు నా చర్యను సమర్థిస్తూ నన్ను గౌరవిస్తాడు. ఆ నమ్మకం నాకుంది.' ఎంతో గంభీరంగా, మంద్రంగా ప్రారంభమైన ఆయన పలుకులు మధురంగా, అనురాగ భరితంగా అంతమైనాయి. వాళ్ళు దారి తప్పిన బాటసారుల్లా నిలబడ్డారు. వారి కళ్ళల్లో ఏదో నిస్సహాయత, అసహనం కన్పించాయి. 'పొద్దుపోయింది. పోయి పడుకోండి' అనునయంగా అంటూ ఆయన లోపలికి వెళ్ళిపోయాడు. ఆయన వెళ్ళగానే వాళ్ళంతా ఒక్కసారి చైతన్యవంతులైనారు. ఛీః ఛీః కబుర్లతో కార్యం చెడగొట్టుకున్నామని పరస్పరం



నిందించుకొన్నారు. 'రేపులేరా ఆయన సంగతి' అనుకుంటూ ఇళ్ళకు వెళ్ళారు.

పంతులు పడుకొన్నాడేకాని ఆలోచనలతో మనస్సు వేడెక్కిపోతుంది. పిల్లల ప్రతీకారేచ్ఛ, ఉపాధ్యాయుల నిర్లిప్తత, తల్లిదండ్రుల ఆరాటం, భార్యాబిడ్డల ఆవేదన ఒక్కసారి పంతులుగారి మనస్సును నొక్కిపట్టి - నీవు చేసింది తప్పు-అని నిలదీసి అడుగుతున్నాయా అనిపించింది. ఇంతమందికి విచారం కల్గించే తన నిజాయితీ, క్రమశిక్షణ కంటె పరిస్థితుల కనుగుణంగా సర్దుకపోవడం వివేకం, విజ్ఞత అని మనసు చాటిచెప్తుంది. కాని అంతరాత్మ మాత్రం 'నీవు చేసింది న్యాయం. అది నీ ధర్మం కూడ' అంటూ దృఢంగా నొక్కి చెపుతోంది.

ఉదయం స్కూలుకు రాగానే సెక్ర

టరిగారు, సజ్జనరావుగారు వచ్చినట్లు తెలిసింది. సజ్జనరావు గారంటే ఆ ప్రాంతానికి పట్టాలేని ప్రభువు. పదవి లేని ప్రముఖుడు. హెడ్‌మాస్టరుగారు సుబ్బరామయ్యను ప్రక్కకు పిల్చి 'రాత్రంతా కన్నుమూస్తే ఒట్టండీ మేష్టారూ. ఆ వీరభద్రయ్యగారిని ఒప్పించేసరికి తలప్రాణం తోకకు వచ్చిందంటే నమ్మండి. మీరు ఊఁ అంటే తప్ప ఈ తోకలోనైన ప్రాణం నిలిచేటట్లు లేదు. ఆ వీరభద్రయ్య రుద్రుడిలా విరుచుకపడి మీకు ఏ అపకారం చెయ్యడానికైనా సిద్ధపడ్డాడు. ఏదో పని మీద ఇటు వచ్చిన సెక్రటరిగారిని సజ్జనరావు ద్వారా ముగ్గులోకి దింపాడు చూడండి' అంటూ ఆగారు అలుపు తీర్చుకోడానికీ, అవతల మనిషిని అంచనా వేసుకోడానికి. సుబ్బరామయ్య యేమీ మాట్లాడలేదు.

'వలలు పన్నడంలో, వలలు తీయడంలో సజ్జనరావుగారిక్కి సాటిలేరనే విషయం మీకు తెలియంది కాదు. సెక్రటరిగాని, చైర్మన్ గాని ఆయన ఎంత చెపితే అంత. ఆఖరుకు నే నెట్లాగో తంటాలుపడి వారందరినీ ఒప్పించాను.' ఆ ఒప్పందం ఏమిటా అన్నట్లు సాలోచనగా చూశారు పంతులుగారు.

'ఆ! ఏమీ లేదండీ. మీరు ఒక్క మాట క్షమాపణ చెప్పాలి. ఏముంది. నా తప్పు అంటే పోతుంది. ఆ తర్వాత అంతా నేను చూసుకుంటాను' అన్నారు హెడ్‌మాష్టారుగారు హామీ యిస్తూ.


'ఎవరికీ? సెక్రటరిగారికా, సజ్జనరావుగారికా?' అడిగాడు పంతులు సందేహంగా, అయోమయంగా.

'కాదు. వాడికేనండి, ఆ ప్రసాదుకే.' అంటూ ఏదో పని గుర్తుకువచ్చినవారిలా హడావిడిగా వెళ్లారు హెడ్‌మాస్టరుగారు.

పంతులు నిశ్చేష్టుడైనాడు. భూమ్యాకాశాలు తలక్రిందులై తాను ఆకాశం మీద తలతో నడుస్తున్నట్లుగా అన్పించింది. అంతలో సెక్రటరిగారి పిలుపు అందింది.

సెక్రటరిగారు సుబ్బరామయ్య వైపు చూసి 'ఏమయ్యా నీవేనా సుబ్బరామయ్యావు. చూడబోతే వయసుమళ్లిన వాడిలా కన్పిస్తున్నావు. విద్యార్థుల మీదికి వస్తాదులా దూకుతావంట నిజమేనా? నీకు ఉద్యోగమిచ్చింది చదువు చెప్పమని కాని పిల్లవాండ్రను చావగొట్టి చెపులు ఊయ్యమని కాదు.' అన్నారు, అధికారపు వేడి, రాజకీయ వేడి చూపిస్తూ. వీరభద్రయ్య మీసాలు దువ్వుకొన్నాడు దర్జాగా. సజ్జనరావుగారు అందుకున్నారు.

'ఆ అబ్బాయికంటె నీవు పెద్దవాడవు కాబట్టి వాన్ని కొట్టావు. వాళ్ల నాన్న నీకంటె గొప్పవాడు కాబట్టి నిన్ను కొడ్తే ఏమి చేస్తావు? అయితే నీవు చేసిన పని ఆయన చెయ్యలేదు. ఎందుకంటే ఆయన పెద్దమనిషి గనుక.' వీర




భద్రయ్య ఉలిక్కిపడ్డాడు. వాహినీ వారి పెద్ద మనిషిగా ఆ చుట్టు ప్రక్కల గ్రామాల్లో ఆయనకు గొప్ప పేరుంది. ఏదో నిర్ణయానికి వచ్చినవాడిలా సెక్రటరి పంతులువైపు చూస్తూ ఇలా అన్నారు. 'ఏదో పెద్దవాడివి నీ కడుపు కొట్టడం భావ్యం కాదు. కాబట్టి వారు చెప్పినట్లుగా రాజీపడు. కాదంటే ఉద్యోగం వదులుకోవలసి వస్తుంది. నేను చెప్పవలసింది చెప్పాను. తర్వాత నీ ఇష్టం,' అంటూ వారు వెళ్లిపోయారు.

అప్పటిదాకా నిర్వికారంగా, నిరామయంగా నిలబడ్డ పంతులు నీరసంగా కుర్చీలో కూర్చున్నాడు. 'విశ్వానికి విజ్ఞానాన్ని ప్రసాదించే ఓ విద్యాదేవి ! నీ సేవకు అంకితం చేసిన నీ పుత్రుల జీవితాల కెంతటి ఘనసత్కారాలో గమనించు తల్లీ !' అయన హృదయం మూగ వేదనతో మూల్గింది. భారతీయ సంస్కృతికి మూలకందమైన గురుశిష్య సంబంధా లెంత తలక్రిందులైనాయి ! విద్యార్థి భవిష్యత్తును తీర్చిదిద్దబోయిన తన తప్పుకు ఆ విద్యార్థినే క్షమాపణ కోరాలి. అజ్ఞానానికి అంజలి ఘటించాలి. దౌర్జన్యానికి దాసోహమనాలి. ఆయన నరాలు వింటినారిలా రివ్వున సాగి ఆగినాయి. ఉద్విగ్నుడై లేచి అటు యిటూ పచార్లు చేశాడు. త్యాగధర్మాల కోసం తను తన కుటుంబం బలిఅయినా పరవా లేదు. అధికారానికి, అహంభావానికి తల వొంచి బ్రతుకు తెరువు కోసం తన వ్యక్తిత్వాన్ని, వృత్తి ధర్మాన్ని పణంగా పెట్ట లేను-అనుకున్నాడు. ఆయన మోముపై ప్రశాంత నిశాంత నైర్మల్యం అలుము కుంది.

హెడ్‌మాష్టరుగారు వచ్చి పంతులు గార్ని అసెంబ్లీ హాలులోనికి తీసుక వెళ్లారు. వేదికమీద సజ్జనరావుగారు

హెడ్‌మాష్టరుగారు, వారి ప్రక్క సుబ్బరామయ్యగారు కూర్చున్నారు. ఒకవైపు ప్రెసిడెంటు వీరభద్రయ్యగారు వారి భజనబృందం, మరొకవైపు ఉపాధ్యాయ వర్గం ఆసీనులైనారు. ఉరకలువేసే ఉత్సాహంతో విద్యార్థి సముదాయం వరద వచ్చిన నదిలా హాలునిండా నిండుకొంది. ఈ ప్రత్యక్ష నాటకంలోని అతి రసవత్తరమైన ఈ ఆఖరి అంకంలోని ప్రతి పలుకును, ప్రతి ఉలుకును శ్రద్ధంగా, ఆనందంగా తిలకించే ప్రయత్నంలో ఉన్నారు ప్రేక్షకులు. విరుద్ధమైనది చేయాలని, చేస్తే చూడాలని వాంఛించడం అనాదిగా మానవ హృదయంలో నిక్షిప్తమైన ఒక విలక్షణతయేమో!

ప్రసాద్‌ను పిలిచారు హెడ్‌మాస్టరుగారు. ప్రసాద్ మనసు ముర్రుపాలు త్రాగి తల్లి రొమ్ము గ్రుద్దే కోడెదూడలా అతి ఉత్సాహంతో, అహంభావంతో ఆగి ఆగి గంతులువేస్తుంది. ఆగినపుడల్లా అమాయకంగా బెదురు బెదురుగా చూస్తుంది.

మైకు ముందు పంతులు, పంతులు పక్క ప్రసాద్ నిలబడ్డారు. ఆవు ప్రక్కన చేరిన అలసిపోయిన లేగదూడలా ఉన్నాడు ప్రసాద్. పంతులు తన నిర్ణయాన్ని ప్రకటించే ముందు ఒక్కసారి హాలంతా కలయజూశాడు. ప్రసాద్ ముఖంలోనికి దృష్టి సారించాడు ప్రేమగా. ఆ చూపులో ఎంత వాత్సల్యం! అందులో ఆది గురువుల అనంత ప్రేమ ఉందేమో!

'చెప్పవయ్యా మేష్టారు! క్షమాపణ చెప్పు, సిగ్గెందుకు?' అన్నారు సజ్జనరావుగారు.

ప్రసాద్ మొహం ఎందుకో కళావిహీనమయింది. అతని అంతరంగంలోని ఏ అణుకేంద్రం విచ్ఛిన్నమైందో తెలియదు. కనుకొలుకుల్లో నీళ్లు నిలిచాయి.

'మేష్టారూ! నన్ను క్షమించరూ!!' అంటూ సుబ్బరామయ్యగారి పాదాలపై వాలాడు.

ప్రేక్షకులంతా నిశ్చేష్టులైనారు. విద్యార్థులలో గురుభక్తి పొంగులువారింది. 'సుబ్బరామయ్యగారికి జై' అన్నారు ముక్తకంఠంతో. ప్రసాద్‌ను రెండు చేతులతో లేవనెత్తి హృదయానికి హత్తుకొన్నాడు పంతులు.

ఆశీర్వచనాల్లా పంతులు అశ్రుబిందువులు ప్రసాద్ తలపై వర్షిస్తుంటే, ఆయన విశాల హృదయకమలాన్ని ప్రసాద్ కన్నీళ్లు కడుగుతున్నాయి.